ప్రజాశక్తి

శుక్రవారం 21 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

డెల్టా రైతుల ఉల్టాపల్టా

మరమ్మతులు పూర్తికాక చిన్న వర్షానికే పొలాల్లోకి నీరు - వెద పద్ధతిలో రైతుల కన్నీటి సాగు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 40 రోజులు దాటినా నీటిపారుదల శాఖ అధికారులు మరమ్మతు పనులు ఇంకా పూర్తి చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలీచాలని వర్షాలతో కాల్వలకు వచ్చిన అరకొర నీటితోనే వెదపద్ధతిలో వరి సాగు చేసిన రైతులను ఆదిలోనే కష్టాలు వెంటాడుతున్నాయి. కాల్వల ద్వారా పారాల్సిన నీరు చిన్నపాటి వర్షాలకే పొలాల్లోకి చేరి పైరును దెబ్బతిస్తోంది.

మరోవైపు కృష్ణా పశ్చిమ డెల్టాకు ప్రస్తుతం 1100 క్యూసెక్కులునీరు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ఒకేసారి 5 వేల క్యూసెక్కుల నీరువిడుదల చేస్తే ఏగట్టు ఎక్కడ తెగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దుగ్గిరాల ప్రాంతంలో మురుగు కాల్వలు, పంట కాల్వలు, పిల్ల కాల్వలో పూడిక తీయకపోవడంతో ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మురుగు కాల్వల స్వరూపం మారి పంట కాల్వలు, పిల్ల కాల్వలకు రెండింటికీ పెద్ద వ్యత్యాసం లేకుండా తయారైంది. కొల్లిపర మండలం అత్తోటవద్ద పూడిక పనులు, ఒ అండ్ ఎం పనులు చేయకపోవడంతో రైతులే ఒక్కొక్కరు రూ.500 చందాలు వేసుకుని మరమ్మతులు చేసుకుంటున్నారు. మరమ్మతులకు ప్రభుత్వం నిధులను సకాలంలో మంజూరు చేయకపోవడం, గతంలో చేసిన పనులకు నిధులు రాకపోవడం, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పనులు చేస్తే సొమ్ము వస్తుందో రాదో తెలియని అయోమయంలో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తదితర కారణాల వల్ల పనులు చేపట్టడంతో జాప్యమైనట్లు తెలిసింది. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో

▶ 2లో



ఇటీవల వర్షాల సందర్భంగా తెనాలి ఐతానగర్-నేలపాడు రోడ్డులో పొలాల్లోకి చేరిన వర్షపు నీరు



గుంటూరు దీక్షల్లో మాట్లడుతున్న నేతాజి



నరసరావుపేట దీక్షల్లో మాట్లడుతున్న ఆంజనేయులు నాయక్

వార్తలు లోపలి పేజీల్లో

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

సమస్యల పరిష్కారం కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మున్సిపల్ కార్మికుల రిలేదీక్షలు

మోడీ దుష్టపాలనను అంతమొందించాలి

రైతు సంఘాల సదస్సులో వక్తలు పిలుపు - 30న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

మోడీ దుష్ట పరిపాలన అంతమొందించటానికి రైతులు, కార్మికులు, కూలీలు ఏకం కావాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతు సమస్యలపై రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో గురువారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. ఈనెల 30న విజయవాడలో జరుగుతున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సదస్సులో తీర్మానించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ నూతన వ్యవసాయ చట్టాల రద్దు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలుకు, పంట రుణాల మాఫీ వంటి కీలక సమస్యలపై ఏడాది పాటు ఢిల్లీలో ఉద్యమం చేపట్టిన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో కేంద్రంపై రైతు సంఘాలన్నీ ఐక్యమై మరోమారు పోరాటానికి సిద్ధమైనట్లు చెప్పారు. మోడి అమలు చేస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపి, ఇక్కడికొచ్చి ప్రజలకు మాయమాటలు చెబుతున్నాయని విమర్శించారు. గతేడాది కంటే ఈ ఏడాది వ్యవసాయ ఖర్చులు 30 శాతం వరకూ పెరిగాయని, పంటలకు కనీస మద్దతు ధర మాత్రం 5 శాతం నుంచి 10 శాతమే పెంచారని తెలిపారు. ▶ 2లో



సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

నేటి నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన

మార్పులు చేర్పులకు అవకాశం 2 లో

ఎరువులు,పురుగు మందులు స్వాధీనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రత్తిపాడు, వట్టిచెరుకూరులోని 3 ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్సు అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. రికార్డులను సరిగా నిర్వహించకుండా వ్యాపారం చేస్తున్న కారణంగా రూ.1.62 లక్షల విలువ చేసే 7.22 మెట్రిక్ టన్నుల ఎరువులు, 2.24 లీటర్ల పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. రూ.6,20,942 విలువ గలిగిన 557 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపేశారు. ఇద్దరు డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి జె.వాసంతి, సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.



నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఇంటి నుండి విదేశాలకు ఎగుమతులు

నరసరావుపేట పోస్టల్ ప్రధాన కార్యాలయంలో డాక్‌ఘర్ నిర్యాత్ కేంద్రం 8 లో

అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగు

ప్రజాశక్తి-తాడేపల్లి

రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడి కుటుంబం అవయవదానికి ముందుకు వచ్చింది. దీంతో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపినట్లయ్యింది. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ విద్యాధరపురానికి చెందిన టి.దినేష్ (22) రోడ్డు ప్రమాదానికి గురవడంతో తలకు బలమైన గాయం తగిలింది. మణిపాల్ ▶ 2లో



టి.దినేష్ (ఫైల్)

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

కళాశాల విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు వివరాలను రూరల్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ బి.జనార్ధనరావు ▶ 2లో



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, వెనుక ముసుగుల్లో నిందితులు



బృంద సభ్యులను సత్కరిస్తున్న వైద్యులు

జిల్లా ఆస్పత్రిలో కేరళ వైద్య బృందం పరిశీలన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సమీపంలో లింగంగుంట్ల పరిధిలో వైఎస్ఆర్ జిల్లా ప్రభుత్వాస్పత్రిని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ కేరళ డాక్టర్ల బృందం గురువారం పరిశీలించింది. వీరికి సూపరింటెండెంట్ డాక్టర్ బివి రంగారావు స్వాగతం పలికారు. వివిధ విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులతోపాటు రోగులనూ అడిగి వివరాలను బృందం సేకరించింది. ఓపీ, ఇతర రికార్డులు, మందులను పరిశీలించింది. నివేదికను కేంద్ర వైద్యశాఖకు అందజేస్తామని తెలిపింది. బృందంలో డాక్టర్ అనిత కుమారి కెఆర్, డాక్టర్ సబిత దాస్ డీఎస్ ఉన్నారు. కార్యక్రమంలో డిపిఒ వన్నూరు బాషా, స్టాటిస్టికల్ ఆఫీసర్ నీలకంఠేశ్వరరావు, డాక్టర్ నాగపద్మజ, పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నెలాఖరుకు 2769 ఇళ్లను సిద్ధం చేయాలి

గృహ నిర్మాణంపై సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : స్లాబ్ లెవల్‌కు వచ్చిన 1485 గృహాలు, స్లాబ్ పూర్తయిన 1284 గృహాలు మొతయతం 2769 గృహాలను ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. గృహ నిర్మాణ పురోగతిపై కలెక్టరేట్‌లోని ఎస్ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం సమీక్షించారు. స్టేజి కన్వర్షన్‌లను త్వరగా పూర్తి చేసి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. బేస్మెంట్ లెవెల్ గృహాలపై దృష్టి పెట్టాలని, ముందస్తుగా ఇనుము, ఇసుక వంటి సామగ్రి తీసుకుని కూడా పనులు మొదటి పెట్టని వారి వివరాలు సేకరించాలని చెప్పారు. లే అవుట్‌లలో విద్యుత్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించలన్నారు. జగనన్న కాలనీల ఆర్చీల నిర్మాణానికి స్థానికంగా అంచనాలు వేసి రెండ్రోల్లో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమీక్షలో గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సురేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు గురువారం చౌత్ర సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్.జె.ఆర్.ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా నిర్వహించాలని, మధ్యాహ్న భోజనంలో వండుతున్న ఫోర్టిఫైడ్ బియ్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని, విద్యార్థులందరూ పాఠశాలలోనే భోజనం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ లేకుండా పక్కాగా అమలు చేయాలని కోరారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు లైబ్రరీ పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన

మార్పులు చేర్పులకు అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఓటర్లజాబితాల పరిశీలన, సవరణలకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. ఈమేరకు గుంటూరు, పల్నాడు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బిఎల్ఓ (బూత్ లెవల్ అధికారి) స్థాయిలో జాబితాల్లో మార్పులు, చేర్పులు చేస్తారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు నెల రోజులపాటు ఎన్నికల విభాగంలో పనిచేసే సిబ్బంది ఇంటింటికి వెళ్లి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలి. ఎవరు స్థానికంగా ఉన్నారు? ఎవరు ఉండటం లేదు? ఆధార్ చిరునామా స్థానికంగా ఉందా లేదా పరిశీలిస్తారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 29 వరకు పోలింగ్ కేంద్రం స్థాయిలో జాబితాల పరిశీలన, ఓటర్ల ఫోటోల ముద్రణ చేపడతారు. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16 వరకు సప్లిమెంటరీ జాబితాలను రూపొందిస్తారు. అక్టోబరు 17న డ్రాఫ్టు ముసాయిదా ఓటర్లజాబితాలను ప్రచురిస్తారు. అక్టోబరు 17నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అంతేగాక అక్టోబరు 28, 29, నవంబరు 18,19 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యంతరాలు, దరఖాస్తులను డిసెంబరు 26న పరిష్కరిస్తారు. జనవరి ఒకటిన తుది జాబితా సిద్ధం చేస్తారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితాలను ప్రచురిస్తారు. మండల స్థాయిలో తహశీల్దార్లు, పట్టణాల్లో మునిసిపల్ కమిషన్లు ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఎన్నికల్లో గెలుపునకు సర్వశక్తులు ఒడ్డుతున్న ప్రధాన రాజకీయపార్టీలు ఓటర్ల జాబితాలపై నిశిత పరిశీలన చేయనున్నారు. గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ స్థానాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ'పై ప్రత్యేక దృష్టి సారించాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికే టిడిపి, వైసిపి, జనసేన, వామపక్షాలు, బిజెపి కూడా నిశితపరిశీలన చేస్తున్నాయి. ఓటర్ల వివరాలతోపాటు అవకాశం ఉన్నచోట్ల వారి ఫోన్ నెంబర్లు కూడా ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తలు సేకరిస్తున్నట్టు తెలిసింది.

ఇంటి నుండి విదేశాలకు ఎగుమతులు

పోస్టల్ ప్రధాన కార్యాలయంలో డాక్‌ఘర్ నిర్యాత్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



సూపరింటెండెంట్ స్వామి

ఇంట్లో తయారు చేసే ఉత్పత్తులను సైతం విదేశాల్లో విక్రయించేలా తపాలా శాఖ విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని పల్నాడు జిల్లా డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ స్వామి చెప్పారు. చిరు వ్యాపారులతో పాటు పారిశ్రామికవేత్తలు, తయారు చేసే ఉత్పత్తులు విదేశాలకు సులువుగా పంపే విధంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ప్రధాన తపాలా కేంద్రంలో డాక్‌ఘర్ నిర్యాత్ కేంద్రాన్ని (డిఎన్‌కె) ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, థాయిలాండ్, యూరప్, దుబాయ్, ఫ్రాన్స్, చైనా తదితర దేశాల్లో తెలుగువారు స్థిరపడ్డారని వారికి ఇక్కడివారు ఇంట్లో తయారు చేసే వస్తువులు, పిండి వంటలు, ఇతర సామగ్రిని పంపించుకునే వీలు కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో పోస్టల్ బిల్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ (పిబిఇ)ని మ్యాన్యువల్‌గా నియమించిన ఫారిన్ ఫోస్ట్ ఆఫీస్ కౌంటర్లు, అంతర్జాతీయ వ్యాపార కేంద్రాల్లోనే ఫైల్ చేసే వెసులుబాటు ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం పిబిఇని ఆన్‌లైన్ ద్వారా ఇంటివద్దే ఫైల్ చేసి సమీపంలోని డిఎన్‌కె కేంద్రాల ద్వారా ఎగుమతి చేసుకోవచ్చని వివరించారు. అన్ని జిల్లా కేంద్రాల్లోని పోస్టాఫీసులతోపాటు ప్రధాన పోస్టాఫీసుల్లోనూ డిఎన్‌కెలను ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు.

డెల్టా రైతుల ఉల్టాపల్టా

(మొదటి పేజీ తరువాయి)

1.84 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గుంటూరు ఛానల్ ద్వారా 27 వేల ఎకరాలు, చెరువుల ద్వారా 3,795 ఎకరాలు సాగు చేస్తారు. ప్రతి ఏటా డెల్టాలో వరిసాగుకు 26.34 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. ఇందులో కృష్ణా పశ్చిమ డెల్టాకు 22.24, గుంటూరు ఛానల్ ద్వారా నాలుగు టీఎంసీలపే కాల్వల ద్వారా రైతులు వినియోగించుకుంటారు. మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, పొన్నూరు, తెనాలి, తాడికొండ నియోజకవర్గాల్లోని 2,14,985 ఎకరాల్లో మొదటి పంటగా వరిసాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు కోసం గతనెల 7న మంత్రి అంబటి రాంబాబు ప్రకాశం బ్యారేజి నుంచి కాల్వలకు నీరు విడుదల చేశారు. అయితే నీటి విడుదలకు ముందే కాల్వల మరమ్మతులు చేయాల్సిన అధికారులు ఇప్పటికీ పూర్తిచేయలేకపోయారు.

ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఒ అండ్ ఎం) కింద ఐదు నియోజకవర్గాల పరిధిలో రూ.8.32 కోట్లతో మొత్తం 86 పనులకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు 30 పనులనుమాత్రమే ప్రారంభించారు. వీటిల్లో 20 వరకు పూర్తయ్యాయి. ఇంకా 56 పనులు ప్రారంభించాల్సి ఉందని ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో అధికారులు ప్రకటించారు. గతనాలుగు రోజులుగా వర్షాలు ప్రారంభం కావడంతో పనులు ఎప్పటికి పూర్తవుతాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. కాల్వల్లో చెత్తాచెదారం, తూటుకాడ, గుర్రుపు డెక్క తొలగింపు పనులు వేసవిలోనే పూర్తి చేయాల్సి ఉండగా జులైలో ఈ పనులు ప్రారంభించడంతో ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు చేబ్రోలు మండలం వడ్లమూడి, శ్రీరంగపురం డ్రెయిన్, కొండూరు డ్రెయిన్, పెదకాకాని మండలం నంబూరు, వడ్డిముక్కల వద్ద పొలిమేర డొంక, పొన్నూరు మండలం నిడుబ్రోలు, తెనాలి మండలం కొలకలూరు మైనర్ డ్రెయిన్లలో పూడిక పనులు పూర్తి చేసినా మిగతావి అసంపూర్తిగా ఉన్నాయి.

మోడీ దుష్టపాలనను అంతమొందించాలి

(మొదటి పేజీ తరువాయి)

అయినా కనీస మద్దతు ధర పెంచాలని అడగలేని స్థితిలో రాష్ట్రం ప్రభుత్వం ఉందన్నారు. గతేడాది రూ.1100 కోట్లు రాష్ట్రంలో బీమా ప్రీమియం వివిధ కార్పొరేట్ కంపెనీలకు వెళ్లిందని, కానీ తిరిగి రైతులకు వచ్చింది రూ.300 కోట్లేనని తెలిపారు. రూ.300 పురుగుమందు డబ్బాలు రూ.3 వేలకు అమ్ముతుంటే పట్టించుకునే వారే లేరన్నారు. విత్తన, పురుగుమందు, ఎరువుల చట్టాలు పట్టిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో 6500 రైతు ఆత్మహత్యలు జరిగాయని, రైతు ప్రభుత్వం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. సహకార రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే చర్యలు చేపటారని విమర్శించారు. ఈనేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవటానికి రైతుల్ని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ కేరళ తరహా రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి రైతులు ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. నూటికి 60 శాతం పైగా ఉన్న కౌలులు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపించిందన్నారు. భూ యజమాని సంతకం, అనుమతి కావాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ప్రకారం ఎక్కడా కూడా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందించలేదన్నారు.

తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.లక్ష్మణారెడ్డి మాట్లాడుతూ పండిన పంటలకు ధరలు ఉండటం లేదన్నారు. విపత్కర పరిస్థితిలో వాతావరణ అనుకూలించని పరిస్థితుల్లో రకరకాల వైరస్లతో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. చివరకు మార్కెట్ దోపిడి తోటి రైతులు నష్టపోతున్నారన్నారు. కిసాన్ క్రాంతి సంఘర్ష సంఘం రాష్ట్ర కార్యదర్శి మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ సహకార రంగాలను దెబ్బతీసే విధంగా రాష్ట్రాల హక్కులను హరించేలా సహకార రంగాలను కేంద్ర ప్రభుత్వంలో స్వాధీనం చేసుకుందన్నారు. గ్రామాలకు పట్టుకొమ్మలైన సహకారంగాలను ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.శివయ్య, శాస్త్రవేత్త ప్రొఫెసర్ టి.వేణుగోపాలరావు మాట్లాడారు. సదస్సులో కొండవీటి వాగు ముంపు గురవుతున్న పంట భూములు కాపాడాలని, గుంటూరు ఛానల్ పొడిగింపునకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, మన సహకార డెయిరీలను గుజరాత్ అమూల్ డైరీ నుండి కాపాడాలని, కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని తదితర తీర్మానాలు ఆమోదించారు. సదస్సులో ఛానల్ విస్తరణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు కుర్రా హరిబాబు, ఆచార్యులు, వివిధ సంఘాల నాయకులు పి.శివాజీ, కె.రాజశేఖర్ రెడ్డి, పోతురాజు, వి.నరసింహారావు, జె.శివశంకర్, కె.రంగారెడ్డి, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

గురువారం వెల్లడించారు. గంజాయికి బానిసలైన నలుగురు యువకులు గుంటూరు నుంచి గంజాయి కొనుగోలు చేసి, వారు సేవించటమే కాకుండా విద్యార్థులకు విక్రయిస్తున్న వారు మండలంలోని అంగలకుగురులో ఉంటున్నట్లు గుర్తించిన పోలీసులు దాడి చేశారు. ఓ గదిలో గంజాయి సేవిస్తుండగా నలుగుర్ని పట్టుకుని వారి నుండి 1.4 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. నిందితుల్లో గుంటూరుకు చెందిన బొంతా నితిన్ అలియాస్ కిట్టు, అంగలకుదురుకు చెందిన క్రోసూరు వెంకట పవన్ సాయిరామ్, చింతలపూడికి చెందిన సంఘం ఉదయకిరణ్, తెనాలిలోని చెంచుపేటకు చెందిన జమ్మలమూడి గోపి ఉన్నారు. వీరంతా ఒకరికొకరు కొంతకాలం క్రితం పరిచయమయ్యారు. బొంతా నితిన్ గుంటూరుకు చెందిన కటకం రాజేష్, దాసరి జంజయ్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తాడు. దానిని సంఘం ఉదయకిరణ్ ఉంటున్న అంగలకుదురులోని శ్రీనగర్ కాలనీ రూమ్‌లో ఉంచి, అదే రూములో నలుగురూ కలిసి గంజాయి సేవిస్తారు. మిగిలిన గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి వడ్లమూడి, అంగలకుదురు ప్రాంతాల్లో విద్యార్థులకు విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో సంఘం ఉదయకిరణ్ బుధవారం బొంతా నితిన్‌కు ఫోన్ చేసి కిలోన్నర గంజాయి కావాలని కోరగా, అతను దానిని తీసుకుని ఉదయ కిరణ్ రూమ్‌కు చేరుకున్నాడు. దానిలో కొంత గంజాయిని తీసి సేవిస్తుండగా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. గుంటూరుకు చెందిన కటరం రాజేష్, దాసరి సంజయ్ పరారీలో ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిఐ, ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సిఐ కె.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ పోతురాజు, పిసిలు పి.శ్రీనివాసులు, ఎం.రాము, పి.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రికి తరలించగా వైద్యులు క్రేనియోటమి శస్త్రచికిత్స చేశారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించలేదు. మిగతా వైద్య పరీక్షల అనంతరం బ్రెయిన్ డెడ్‌గా పరిగణించారు. దినేష్ అవయవ దానానికి భార్య వసంత, తల్లిదండ్రులు సుశీల, ఏడుకొండలు అంగీకారం తెలపడంతో జీవన్‌ధాన్ చైర్మన్ కె.రాంబాబు, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. కాలేయం, కిడ్నీని మణిపాల్‌కు, కళ్లు, సికింద్రాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు, ఊపిరితిత్తులు కిమ్స్ ఆసుపత్రికి, ఒక కిడ్నీ విజయవాడలోని విజయ ఆసుపత్రికి తరలించారు.

అమరావతిలో రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్ ఫ్రా ప్రాజెక్టులకు శ్రీకారం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో రూ 72.06 కోట్లతో సోషల్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్ లకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు గురువారం సిఆర్ డి ఎ కమిషనర్ వివేక్ యాదవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. పేద ప్రజలు స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకోవాలనే బృహత్తర ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా నవ రత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఎన్టీఆర్-గుంటూరు జిల్లాలలోని 53,216 మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయటంతో పాటుగా అందులో స్థిర నివాసాలను ఏర్పాటు చేసే అద్భుత ఘట్టానికి ఈ నెల 24వ తేదీన కృష్ణాయపాలెంలో గృహనిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం జరుగనుంది.

పేద ప్రజలకు స్థిర నివాసాలు ఏర్పాటు చేయటమే కాకుండా వారి విద్య, ఆరోగ్య ప్రమాణాలను అత్యుత్తమ స్థాయిలోనికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర పురపాలక,పట్టణాభివద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్ఫ్రా ప్రాజెక్టులకు 25 లే అవుట్లలో నైబర్ హుడ్ స్కూల్స్,ఈ - హెల్త్ సెంటర్లు,అంగన్ వాడీ సెంటర్లు,డిజిటల్ లైబ్రరీలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. అమరావతిలో పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పక్కా గహాలతో పాటు టిడ్కో గహాలతో కలిపి 2.36 లక్ష ల మంది జనాభా నివశిస్తారు. వారి జీవన ప్రమాణాలు అత్యుత్తమంగా ఉండాలనే ఉద్దేశంతో అమరావతి స్మార్ట్ అండ్ సస్టైనబుల్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏఎస్ఎస్సీఎల్) ఈ సోషల్ ఇన్ఫ్రా ప్రాజెక్టుల ను చేపడుతుందని ప్రకటనలో తెలిపారు. రాజధానిలో సెంటు స్థలాలకు సంబంధించిన 25 లే అవుట్లలో ఏఎస్ఎస్సీఎల్ చేపట్టే 45 ప్రాజెక్టుల నిర్మాణాల వివరాలను వెల్లడించారు.

నైబర్ హుడ్ స్కూల్స్ - 11 - వ్యయం రూ. 25 కోట్లు, **గ్రామాలు:** మందడం, పిచ్చుకలపాలెం, ఐనవోలు, అనంతవరం, నెక్కల్లు, కష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, నిడమర్రులో మూడు పాఠశాలలు, ఈ-హెల్త్ సెంటర్లు 12,వ్యయం రూ.20 కోట్లు,**గ్రామాలు:** మందడం, పిచ్చుకలపాలెం, ఐనవోలు,అనంతవరం, నెక్కల్లు, కష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, నిడమర్రులో నాలుగు సెంటర్లు,అంగన్వాడీ సెంటర్లు 11, వ్యయం రూ. 17.60 కోట్లు, **గ్రామాలు:** మందడం, పిచ్చుకలపాలెం, ఐనవోలు,అనంతవరం,నెక్కల్లు, కృష్ణాయపాలెం, నవులూరు,కురగల్లు,

నిడమర్రులో మూడు సెంటర్లు,డిజిటల్ లైబ్రరీలు 11, వ్యయం రూ.9.46 కోట్లు,**గ్రామాలు:** మందడం, పిచ్చుకలపాలెం,ఐనవోలు,అనంతవరం,నెక్కల్లు, కృష్ణాయపాలెం,నవులూరు,కురగల్లు, నిడమర్రులో మూడు లైబ్రరీలకు శంకుస్థాపనలు జరుగనున్నాయని వెల్లడించారు.

అమరావతిలో పచ్చదనంకు చర్యలు

రాజధాని అమరావతిలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన లే అవుట్లలో అయిదు వేల మొక్కలతో పచ్చదనం అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని సి ఆర్ డి ఎ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. సి ఆర్ డి ఎ ల్యాండ్ స్కేప్ ఎన్విరాన్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో అయిదు వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. లే అవుట్లలో పచ్చదనం అభివద్ధి కోసం కేటాయించిన 10 శాతం భూమికి సంబందించి 146 ఎకరాలలో 28 వేల రావి, వేప,నేరేడు,బాదం, రెయిన్,పచ్చతురాయి, పొగడ,ఆకాశమల్లె వంటి నీడనిచ్చే, పండ్ల చెట్లతో ఈ ప్రాంతం కనువిందు చేయనుందని తెలిపారు.

వైసిపిలో వర్గపోరు

'జగనన్న సురక్ష' వేదికగా రెండు వర్గాలు బాహాబాహి



ప్రజాశక్తి-తాడేపల్లి

వైసిపిలో వర్గ విభేదాలు గురువారం ఒక్కసారిగా బయట పడ్డాయి. కృష్ణనగర్ 14వ వార్డులో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ఇందుకు వేదికగా మారింది. గత ఎన్నికలు ముగిసిన దగ్గర నుంచి తాడేపల్లిలో మాజీ ఎంపిపి వేమారెడ్డి ఒక వర్గంగా, బి.వేణుగోపాలసోమిరెడ్డి మరో వర్గంగాను ఉంటూ వస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి తాడేపల్లిలో అసలైన నాయ కత్వం వేణుదేనని ఆయన చేతల ద్వారా చూపిస్తున్నారు. తాడేపల్లి పట్టణంలో, నియోజక వర్గంలో ఏ కార్యక్రమం జరిగినా వేణు గోపాలసోమిరెడ్డే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. తమకెందుకులే అన్నట్లు వేమారెడ్డి వర్గం ఉంటూ వచ్చింది. నాలుగు నెలల క్రితం ఎంటిఎంసి వైసిపి అధ్యక్షునిగా వేమారెడ్డిని నియమిస్తూ సిఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అధ్యక్షునిగా ప్రక టించారే తప్ప ఆయనకు ఎటువంటి కార్యక్రమాలక ఆహ్వానం అందడంలేదు. ఎమ్మెల్యే ప్రతీ కార్యక్రమానికి వేణు గోపాల సోమిరెడ్డినే ఆహ్వానిస్తున్నారు. గతం నుంచి వైరుద్యాలు అలాగే కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే అమెరికా వెళ్లిన సమయంలో వేమా రెడ్డిని అధ్యక్షునిగా ప్రకటించారు. ఆ ప్రకటనతో తనకు ఎలాంటి సంబంధం లేనట్లు ఎమ్మెల్యే వర్గం వ్యవహరిస్తోంది. ప్రతీ కార్యక్రమంలో వేణుగోపాలసోమిరెడ్డికే ప్రాధాన్యత ఇస్తోంది. గురువారం కృష్ణనగర్ 14వ వార్డులో ఎంటిఎంసి అసిస్టెంట్ కమిష నర్ శ్రీనివాసరావు అధ్యక్షతన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమ సభ జరిగింది. ఈ సందర్భంగా వేణు వర్గానికి చెందిన డేవిడ్‌రాజు మైకు తీసుకుని మాట్లాడుతున్నారు. వేమారెడ్డి వర్గం కేళి వెంకటేశ్వరరావు ముందు మైకు గోరె బాబుకు ఇవ్వాలని వాదనకు దిగారు. ఈలోపు అసిస్టెంట్ కమిషనర్ కలుగజేసుకుని డేవిడ్ రాజు మాట్లాడిన తర్వాత అవకాశం ఇస్తామని చెప్పారు. డేవిడ్ రాజు మాట్లాడే సందర్భంలో కేళి వెంకటేశ్వరరావు అడ్డు తగల డంతో వివాదం పెరిగింది. తాను దళితుడునని తనను చిన్న చూపు చూస్తారా అని డేవిడ్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మాటామాటా పెరిగి, పరస్పరం ఒకరిపైకి ఒకరు వెళ్లి దూషించు కున్నారు. పరిస్థితిని గమనించిన వైసిపి పట్టణ కన్వీనర్ వేణు, మాజీమున్సిపల్ వైస్‌చైర్మన్ రామకృష్ణారెడ్డి ఇరువర్గాలను సముదాయించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 31,838
మిర్చి ఎగుమతి	: 34,357
మిర్చి నిల్వ	: 10,202

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,500
నెం.5	10,500 - 22,500
273	18,500 - 21,200
341	10,500 - 24,000
సూపర్ 10	20,600 - 21,500
	నాన్ ఏసి
తేజ	10,000 - 24,200
బడిగి	11,000 - 26,000
దేవనూరు డీలక్స్	12,500 - 19,000
తాలుకాయలు	5,000 -14,500
	ఏసి
334	15,500 - 22,000
273	18,500 - 24,500
341	13,500 - 18,500
4884	21,000 - 21,000
తేజ	10,500 - 24,500
బడిగి	14,200 - 25,000
దేవనూరు డీలక్స్	14,500 - 18,500
తాలుకాయలు	7,000 -13,000



ఇంటర్నేషనల్ చెస్ డే

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

స్థానిక వివేకా ఫాస్టర్ స్కూల్‌లో గురువారం ఇంటర్నేషనల్ చెస్ డే కార్యక్రమం నిర్వహించారు. చెస్ అకాడమీ ఆధ్వర్యంలో బ్లైండ్ సైమల్ చెస్ పోటీ నిర్వహించారు. వివేక పోస్టర్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీ చరణ్ సందిపాగు ఒకేసారి ఐదు గురు చెస్ క్రీడాకారులతో ఆడి విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా వివేకా స్కూల్స్ డైరెక్టర్ ఉప్పల సుకుమార్ ఆ విద్యార్థిని అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో పాల్గొనడం వలన ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆయన అన్నారు. పొన్నూరు చెస్ అకాడమీ ప్రెసి డెంట్ గంగరాజు మురళీ కృష్ణ,సెక్రటరీ బాజీ బాషా, వైస్ ప్రెసిడెంట్ పి ఎల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్షణ సైన్యం వేడుకలు



ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

స్థానిక ఇవాంజిలింగ్ బూత్ హాస్పిటల్ లో రక్షణ సైన్యం ఇండియా మధ్య రాష్ట్రంలో అవతరించి 128 సంవత్సరాలు అయిన సందర్భంగా గురువారం వేడుకలు నిర్వహిం చారు. కెప్టెన్ కె. కనకరత్నం, అడ్మినిస్ట్రేటర్స్, కరస్పాండెంట్ రాజశ్రీలు సైన్య పతాకం ఎగురవేశారు.

ఎన్‌సిసి సర్టిఫికెట్ ఫలితాల్లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజి విద్యార్థులు గుంటూరులోని 25(ఎ)బిఎన్ వారు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన బి సర్టిఫికెట్ పరీక్షా ఫలితాల్లో 17 మంది, సి సర్టిఫికెట్ ఫలితాల్లో 9 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులకు సుబేదార్ మేజర్ విజయ్ మోహిత్ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-ఈపూరు: మండలంలోని గోపువారిపాలెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. దాడి చేసి ఐదుగురుని అరెస్టు చేసి, రూ.2130 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.

ఓటర్ల జాబితాపై నేటి నుండి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గం ఓటర్ల జాబితా పై శుక్రవారం నుండి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు తహశీల్దార్ జివి రాంప్రసాద్ తెలిపారు. గురువారం ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - వినుకొండ : వెన్నపూస వాగు కాలనీలో అధికార పార్టీ చెందిన వ్యక్తులు అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఆ పార్టీ కార్యాలయం నుండి సురేష్ మహల్ రోడ్డు మీదగా తహశీల్ధార్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమంగా నిర్మాణాలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అధికార వైసిపికి చెందిన పిడతల ఏసుబాబు, పిడతల అన్నబాబు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, గత నెలలో నిర్మాణం చేపట్టేందుకు యత్నించడంతో వివాదం తలెత్తి పోలీసులకు కూడా ఫిర్యాదు చేయగా తహశీలాదర్ ద్వారా పరిష్కరించుకోవాలని వారు సూచించారని చెప్పారు. తహశీల్దార్‌కు 'స్పందన'లో ఫిర్యాదు చేయగా కొలతలు వేసి అది ప్రభుత్వ భూమా? ప్రైవేటు భూమా? అనేది నిర్ధారిస్తామని తహశీల్దార్ చెప్పారని తెలిపారు. అయినా సరైన చర్యల్లేవని, అక్రమార్కులు రెచ్చిపోతూనే ఉన్నారని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే న్యాయ పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముని వెంకటేశ్వర్లు, నాసర్ బి, రంజాన్ బి, తిరుమల లక్ష్మి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

అంతరిక్ష విజ్ఞానంపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట : మండలంలోని మురికిపూడి జెడ్‌పి పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ చంద్రుడి దినోత్సవం నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానంపై క్విజ్ నిర్వహించి విజేతలకు పుస్తకాలను బహూకరించారు. హెచ్‌ఎం డి.ధనలక్ష్మి మాట్లాడుతూ తొలిసారిగా మానవుడు చంద్రునిపై కాలు పెట్టిన దినాన్ని అంతర్జాతీయ చంద్ర దినోత్సవంగా జరుపుతారని చెప్పారు కార్యక్రమంలో పిఇటి ఇమ్మానియేల్‌రాజు, జెవివి అధ్యక్ష కార్యదర్శులు డి.బుజ్జిబాబు, కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఫారెస్ట్ బీట్ క్యాంప్ ఆఫీసర్ పరిశీలన

ప్రజాశక్తి-దాచేపల్లి

దాచేపల్లి మండలం మాదినపాడు ఫారెస్ట్ బీట్ లో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ క్యాంప్ కార్యాలయాన్ని ఏపీ స్టేట్ విజిలెన్స్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి రవిశంకర్ శర్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శంకరయ్య ఎస్ఎఫ్ఒ ప్రసాద్, దాచేపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మురళి బీట్ ఆఫీసర్ కె.రాకేష్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రతిపక్ష నేతగా సిఎం జగన్ మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించారని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండ్రోజుల రిలేదీక్షలను గురువారం చేపట్టారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద తొలిరోజు దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతన చట్టం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి కేవలం కాంట్రాక్ట్ కార్మికులనే నామమాత్రంగా పర్మినెంట్ చేశారన్నారు. ఆప్కాస్ విధానం తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సాయంత్ర దీక్షను సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. సిఐటియు మండల అధ్యక్షుడు సిలార్ మసూద్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాల్మన్, నాయకులు నవీన్, టి.మల్లయ్య, వీరకుమార్, పి.ఏసు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల దీక్షల్లో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద్రకళ



సత్తెనపల్లి దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎ.ప్రసాదరావు, డి.విమల

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణంలోని హైలాండ్ సెంటర్లో మొదటి రోజు దీక్షను సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు ప్రారంభించగా యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ మాట్లాడారు. కరోనాకు కాలంలో పారిశుధ్య కార్మికుల సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగిడాయని, కొందరి కాళ్లనూ కడిగి ఆ నీళ్లను నెత్తిన పోసుకున్నారని చెప్పారు. అయితే కార్మికుల సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే కార్మికులందర్నీ పర్మినెంట్ చేస్తానన్న జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మడమ తిప్పారని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ అంశాలపై ఈ నెల 27న మున్సిపల్ ముట్టడి, వచ్చేనెల 7న

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల రిలేదీక్షలు

కలెక్టరేట్ ముట్టడిలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీక్షలకు మద్దతుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ ప్రజలందరికీ సేవలు అందించే పారిశుధ్య కార్మికుల్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కార్మికుల ఉద్యమానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. దీక్షల్లో కార్మికులు కె.వీరయ్య, కె.కృష్ణవేణి, డి.మార్తమ్మ, సిహెచ్.అనంతలక్ష్మి, టి.పద్మ, పి.పార్వతి, కె.సుజాత, పద్మ, అచ్చుమ్మ, మేరీ, రోశమ్మ, సీతారామయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి -సత్తెనపల్లి : రిలేదీక్షలను సిఐటియు సత్తెనపల్లి పట్టణ ఉపాధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు ప్రారంభించారు. శిబిరాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల సందర్శించి మద్దతిచ్చారు. కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు, గ్లౌజులు, మాస్కులు రెండేళ్లుగా ఇవ్వడం లేదని, వాటిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికులను నియమించకపోవడంతో ఉన్న కార్మికులపై పనిభారం ఎక్కువవుతోందని, పలువురు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్‌ను క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. మొదటి రోజు దీక్షను సాయంత్రం సిఐటియు పట్టణ నాయకులు ఎం.జగన్నాథరావు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ, పట్టణ అధ్యక్షులు సిహెచ్.పెద్దవెంకయ్య, కార్యదర్శి జి.కమలమ్మ, నాయకులు ఎం.సత్యవతి, జె.నాగమణి, సిహెచ్.సునీత, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

జీతం రూపాయి అయినా పెంచారా?

హామీలను విస్మరించిన సిఎం - సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ దశల వారీ పోరాటం - రిలే దీక్షల ప్రారంభంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం

మాచర్ల



ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బోనిగె ఆనందరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దశల వారి పోరాటంలో భాగంగా రెండ్రోజులపాటు నిర్వహించే రిలే దీక్షలను స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందరాజు మాట్లాడుతూ విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, నామీనులుగా పని చేస్తున్న వారందరిని విఆర్‌ఎలుగా గుర్తించి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అర్హులకు విఆర్ఒ, అటెండరు, వాచ్‌మెన్ తదితర ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. ఎన్నికలప్పుడు పలు హామీలిచ్చిన సిఎం గెలిచాక ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదని అన్నారు. పైగా డిఎ కోత విధించారని మండిపడ్డారు. దీక్షల్లో నాయకులు టి.రామారావు, ఈషావలి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ దశలవారీ పోరాటం చేస్తామని ఏపీ గ్రామ రెవెన్యూ సహయకుల సంఘం (సిఐటియు) మండల అధ్యక్షులు షేక్ సైదాసాహెబ్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలో ఆయన మాట్లాడుతూ డిఎ రికవరీని నిలిపి డిఎతో కూడిన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి యాకోబు, ఏసు, కె.సీతయ్య, మరియమ్మ, కోటేశ్వరరావు, చిన్న కోటేశ్వరరావు, షేక్ ఆదం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన అనంతరం తహశీల్దార్ క్షమరాణికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కాసిం, శివరామకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సుందర్‌రావు, మరియదాసు, వెంకట నరసయ్య పాల్గొన్నారు.


ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రిలే దీక్షలు చేపట్టారు. విఆర్‌ఎలకు మద్దతుగా సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పోలీస్‌గా పిలవబడే వీఆర్‌ఏలు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉందన్నారు. కనీస వేతనాలు కూడా లేకుండా పెట్టి చాకిరి చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వీరి సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో వంశీ, ఏపూరి ఆంజనేయులు, మరియదాసు, షేక్ సుభాని, రత్నం పాల్గొన్నారు.

పిడుగురాళ్ల




నకరికల్లు



బెల్లంకొండ



పెదకూరపాడు



ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మున్సిపల్ కార్మికుల రెండ్రోజుల దీక్షలు ప్రారంభం

గుంటూరు, తెనాలి, తాడేపల్లిలో వర్షంలోనూ దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం 99శాతం హామీలు అమలు చేశామని చెప్పుకుంటుందని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీ ఎందుకు అమలు చేయలేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజి ప్రశ్నించారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ఎన్.ఎం.ఆర్.కార్మికులను పర్మినెంట్ చేయాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, సిపియస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని తదితర డిమాండ్లతో ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ దీక్షలను ప్రారంభించిన అనంతరం నేతాజి మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 6,667 మందిని మాత్రమే పర్మినెంట్ చేస్తున్నట్లు ప్రకటించటం అంటే 'మాట తప్పటం..మడమ తిప్పటం కాదా' అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, అందుకే దశల వారీ ఉద్యమానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు.

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం రెండూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్ని మోసం చేశాయని విమర్శించారు. రిలే దీక్షలకు గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం(సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి కట్లగుంట శ్రీనివాసరావు, గుంటూరు నగర భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాశీంవలి సంఘీభావం తెలిపారు. మొదటి రోజు రిలే దీక్షల్లో భూలక్ష్మి, ఏటుకూరు రోశమ్మ, శ్రావణి, వేల్పూరి కోటేశ్వరమ్మ, కగ్గా పోలేరమ్మ, వేల్పూరి నాగేశ్వరమ్మ, జూటూరి శ్రీలక్ష్మి, నంగన మల్లేశ్వరి, కగ్గా వెంకాయమ్మ, వేల్పూరి భ్రమరాంబ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి : కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలని సిఐటియు జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్మికులు పురపాలక సంఘ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షను బాబుప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళయినా కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. కనీసం స్థానిక అధికారుల పరిధిలోని సమస్యలు కూడా పరిష్కరించటంలేదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్‌వలి, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటేశ్వర్లు, వున్నవ సుధాకర్,



తెనాలి దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న బాబూప్రసాద్



తాడేపల్లిలో దీక్షలు

పి.నాగరాజు, అర్.ప్రవీణ్‌కుమార్, గణేష్, సిహెచ్ పుబ్బమ్మ, బాలమ్మ, ఆర్.భవాని, ఎ.పాపమ్మ, వి.లక్ష్మినారాయణ, జనార్ధనరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : ఆప్కాస్ కింద మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు వానను సైతం లెక్క చేయకుండా మున్సిపల్ కార్మికుల దీక్షలకు కూర్చుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందుకు ప్రస్తుత సిఎం ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులు అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.వెంగమ్మ, బి.సతీష్, జె.శివ, కె.అనూష, శ్యామల, కె.మాధవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో నేడు, రేపు దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి : మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద 21, 22 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చంగయ్య అన్నారు.మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే దీక్షల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు పి పూర్ణచంద్రరావు, మంగయ్య, పరమేశు, ఎన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ నుంచి నీరు విడుదల చేయండి

ప్రభుత్వానికి కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణాడెల్టాకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే పట్టిసీమ నుంచి నీరు విడుదల చేయకపోవడం శోచనీయం అని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. గుంటూరులోని తన నివాసంలో గురువారంఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందన్నారు. గోదావరి వరదలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి రోజుకులక్ష క్యూసెక్కులు వదిలేస్తున్నా పట్టిసీమ నుంచి నీళ్లుతెచ్చి ప్రకాశం బ్యారేజీ కి ఇవ్వటం లేదన్నారు. చంద్రబాబుకు పేరు వస్తుందని పట్టిసీమ మోటార్లు ఆన్ చేయటం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే వరకూ రైతులకు ఇబ్బంది రాకుండా 2016లో చంద్రబాబు పట్టిసీమ కట్టించారని అన్నారు. పోలవరం ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం పూర్తి చేసే పరిస్థితి లేదన్నారు. అందువల్ల పట్టిసీమ నుంచి వెంటనే కష్ణా డెల్టాకు నీరు విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ ప్రారంభమై 40 రోజులు దాటినా కృష్ణాడెల్టాలో కాలువలు మరమ్మతులు ఇప్పటి వరకూ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు చెప్పినా ఇంత వరకు ఇసుక తవ్వకాలను ఆపలేదన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతు సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, ప్రమాదకరమైన చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలో జరిగే సదస్సు పోస్టరును గురువారం రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు ఆవిష్కరించారు. గురువారం విజయవాడ బాలోత్సవ భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలురైతు సంఘం నాయకులు జమలయ్య, జాగృతి రైతు సంఘం కార్యదర్శి మరీదు ప్రసాదుబాబు, కోటయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ సోమనాథన్ కమిటీ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధరలు ఉండాలని కోరారు. అలాగే రైతు, కౌలు రైతులకు ఒక పర్యాయం రుణమాఫీ చేయాలన్నారు. మోడీ దుష్పరిపాలన నుండి రైతులు, శ్రామికులు, వ్యవసాయ కార్మికులను రక్షించాలని కోరుతూ జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు కాజలో సింహాద్రి బసవపున్నయ్య జయంతి సభ

ఉచితంగా అందుబాటులోకి మహాప్రస్థాన వాహనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సింహాద్రి బసవపున్నయ్య 31వ జయంతి సభ కాజ గ్రామంలో పాల కేంద్రం వద్ద శుక్రవారం సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తున్నామని సిపిఎం నాయకులు సింహాద్రి ఆదిశేఖర్, నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ ఎంపి పి మధు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు,ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్, సింహాద్రి సరోజిని తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఉచితంగా మంగళగిరి మండలం కాజా గ్రామంలో సింహాద్రి శివారెడ్డి - బసవపున్నయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాప్రస్తాన వాహనాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఉచిత మహాప్రస్థాన వాహనం మరియు కనీస చార్జీలతో ఏసీ మార్చురీ బాక్స్ వంటి సదు పాయా లను అవసరమైన వారు కాజా, నంబూరు గ్రామా లలోని ప్రజలు వినియో గించు కోవచ్చునని చెప్పారు.





సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు బేబీ రాణి



హాజరైన అంగన్వాడీలు

అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబిరాణి - 19 మందితో ప్రత్తిపాడు ప్రాజెక్టు నూతన కమిటీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అక్షయ విద్యాలయంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రత్తిపాడు ప్రాజెక్టు జనరల్ బాడీ సమావేశం ఏ పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతు గత 48 సంవత్సరాల నుంచి గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్వాడీలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రీ స్కూల్ పిల్లలకు అమ్మ ఒడి, యూనిఫామ్ ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఫుడ్ ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో వారికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలని, 2017 నుండి పెండింగ్లో ఉన్న టీఏ బిల్లులు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని తదితర న్యాయమైన డిమాండ్లను నెరవేరే వరకు అంగన్వాడీలందరూ ఐక్యంగా పోరాటానికి సిద్ధంగావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు వై నేతాజీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమాసుష్మా, పి.దీప్తి మనోజా, సిఐటియు జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు, కాకుమాను నాగేశ్వరావు, సిఐటియు ప్రత్తిపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.జ్యోతి, సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమలత, ఎ పద్మ



ప్రత్తిపాడు ప్రాజెక్టు నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమలత, ఏ.పద్మ కోశాధికారిగా నగరాజకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా శశికళ, కమల జ్యోతి, కుసుమ, శ్రీదేవి, శివపార్వతి, విజయ, సహాయ కార్యదర్శులుగా సుభాషిణి, సైదాని, నవరత్నమణి, అనురాధలతో పాటు మొత్తం 19 మందితో నూతన ప్రాజెక్టు కమిటీ ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి-తాడేపల్లి



దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న తమ సమస్యల పరిష్కారానికి విఆర్ఎలు గురువారం తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం గౌరవా ధ్యక్షులు వేముల దుర్గారావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చినట్లు విఆర్ఎలకు పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హత గల వారిని విఆర్ఒలుగా ప్రమోట్ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విఆర్ఎలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు సాంబశివరావు, హనుమంతరావు, నాగేశ్వరరావు, ఎం.రామారావు, బాబూరావు, ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : తమ సమస్యల పరిష్కారం కోసం వి ఆర్ ఎ లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వి ఆర్ ఎ లకు తెలంగాణలో ఇస్తున్న విధంగా రాష్ట్రంలో కూడా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వి ఆర్ ఎ లను వి ఆర్ వో లుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. రెండు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాన్ని వెంటనే చెల్లించాలని, వి ఆర్ ఎ లకు ప్రభుత్వసంక్షేమ పథకాలు వర్తింప జేయాలన్నారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి వి ఆర్ ఎ లకు ఇచ్చిన హామీలను అమలు జరపాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వి ఆర్ ఎ లుగా నియమించాలన్నారు. వి ఆర్ ఎ లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7,8 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యా లయాల వద్ద రిలే దీక్షలు, ఆగస్టు 25న చలో విజయవాడ చేపట్టనున్నట్లుగా రవి తెలిపారు. కార్యక్రమంలో వి ఆర్ ఎ ల మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ కె ఆదాం షఫీ, కె రమ్య, నాయకులు ఎం చిట్టిబాబు, సిహెచ్ వెంకటేశ్వర్లు,ఎ వెంకటరమణ, కోటయ్య, శేషగిరిరావు పాల్గొన్నారు. ధర్నా అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎల ధర్నా

గణపవరం పాఠశాలను సందర్శించిన అధికారి

ప్రజాశక్తి - నాదెండ్ల



నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాలరావు గురువారం గణపవరం పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరును తనిఖీ చేశారు.ఈ పాఠశాలలో మొత్తం 200 మంది విద్యార్థులకు గాను, 158 మంది హాజయ్యారు. ఈ పాఠ శాలకు హాజరైన ప్రతీ విద్యార్థి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయు లతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు చేశారు.



సామాజిక మాధ్యమాలతో అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

విద్యార్థులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ ఐ వి.గౌతమి అన్నారు.గ౹రువారం 75త్యాల్లురు జడ్ పి హైస్కూల్లో దిశ చట్టం,మహిళల భద్రత,బాలికాసంరక్షణ,బాల్యవివాహాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వ హించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నపుడు 1098 కి కాల్ చేయాలని ,,బాలల అపహరణ, వెట్టిచాకిరి, బాల్యవివాహాలు నేరమని వై.అల్లురెడ్డి వివరించారు. కార్యక్రమంలో టీం మెంబెర్స్ కే.మంగమ్మ, పి.చంద్రశేఖర్, బి.కోటేశ్వరరావు, అసిస్టెంట్ సీడీపివో బి సరళ,,సూపర్వైజర్ జే.భారతీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా పరికరాలు

ప్రజాశక్తి - నాదెండ్ల

బ్యాంక్ ఆఫ్ బరోడా 116 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గణపవరం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనే జర్ పి.జయకర్, జాయింట్ మేనేజర్ నాగయ్య, గణప వరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల విద్యార్థులకు పదివేల రూపాయల క్రీడా పరికరాలను అందజేశారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ దేశంలోని అతి పెద్ద రెండవ బ్యాంక్ ఆఫ్ బరోడా లో విద్యార్థులకు బ్యాంకు ఎకౌంట్లతో పాటు డెబిట్ కార్డ్ ఉచితంగా అంద జేస్తామని అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేసి నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ సుర శంకర్ రెడ్డి, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయు రాలు ఉషారాణి, పిఇటి జె.శ్రీకాంత్, పిడి వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-పెదకూరపాడు



మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదకూరపాడు కి చెందిన ఇంజనీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థి వెంకట నాగ జస్వంత్‌కు గురు వారం ల్యాప్ టాప్ అందజేశారు. ఎన్ఆర్ఐ భాను ప్రకాష్ మాగులూరి సహకారంతో అతనికి ఈ ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎ.రమేష్, బి.గోపాలరావు, ఫౌండేషన్ సభ్యులు మాగులూరి కృష్ణా రావు, కె.ప్రసాద్, కె.కిరణ్ పాల్గొన్నారు.

బిఎల్ఒ డ్యూటీ నుండి మినహాయించండి

పల్నాడు జిల్లా సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - రాజుపాలెం

అంగన్ వాడి కార్యకర్తలను బిఎల్ఒ డ్యూటీ నుండి మినహాయింపు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకురాలు గుంటూరు మల్లీశ్వరి డిమాండు చేశారు. గురువారం ఆమె అంగన్ వాడి కార్యకర్తల తో కలసి రాజుపాలెం తహ శీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్ వాడి కార్యకర్తలకు ఈ డ్యూటీ వేయడం వలన వారు రాజకీయ వేధింపులకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్తలు అహల్య,ప్రభావతి, శశికళ,అరుణ,ప్రశాంతి, విజయ, రమణ, శీదేవి , కాశింబి, కల్యాణ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

జిల్లాలో 380 'జగనన్న సురక్ష' క్యాంపులు పూర్తి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం అపూర్వ రీతిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించి రికార్డుగా నిలిస్తోందని వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అన్నారు.పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని మున్సిపల్ అతిథి గహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పిన్నెల్లి మాట్లాడుతూ జూలై 1 నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష శిబిరాలు రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాల యాలకు గాను ఇప్పటివరకు 10,700 సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహించిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కోసం మొత్తం 1.17 కోట్ల కుటుంబాల్లో సర్వే చేశామని, అందులో 57.3 లక్షల మందికి ధ్రువ పత్రాలు అందించి వారికి నేరుగా ప్రయోజనం చేకూర్చినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ శిబిరాల ద్వారా 27 లక్షల(27,32,866) ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 24 లక్షల (24,46,599) ఆదాయ ధవీకరణ పత్రాలు, 3,159 ఓబీసీ సర్టిఫికెట్లు, 5,199 ఫ్యామిలీ సర్టి ఫికెట్లు జారీ అయ్యాయన్నారు. జిల్లాలో 380 జగనన్న సురక్ష క్యాంపులు పూర్తి చేశామన్నారు. పల్నాడు జిల్లాలో నేటికి మొత్తం 380 క్యాంపులను నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,55,852 ఇళ్లు ఈ కార్య క్రమంలో సర్వే చేశారని తెలిపారు. ఇందులో సేవల కోసం మొత్తం 90,704 అభ్యర్థనలు నమోదు కాగా, వాటిలో 79,841 అభ్యర్థనలు ఆమోదించడం జరిగిందని పిన్నెల్లి వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ , ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కాసు మహేష్ రెడ్డి, నంబూరి శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడులు తమ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు.



మాట్లాడుతున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

'నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా'

వినుకొండ మండలం బ్రాహ్మణపల్లె వద్ద పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను మూల్పూరి ఆగ్రోటెక్,శ్రీ వస్తవ ఫుడ్ ప్రయివేటు లిమిటెడ్ కెకంపెనీ ద్వారా బ్యాంక్ కి తనఖా పెట్టి రూ 53 కోట్లకు పైగా నగదును తీసుకున్నానని తనపై ఆరోపణలను ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా పేర్కొ న్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం తీరుతెన్నులు వివరిం చేందుకు నరసరావుపేట పిన్నెల్లి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో బొల్లా మాట్లాడుతూ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం తగదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వినుకొండకి చెం దిన కీర్తిపాటి వెంకటేశ్వర్లు బ్యాంక్ ఋణంపై సమాధానం చెప్పాలంటూ హైకోర్టు తనకు నోటీసులు ఇచ్చినట్లు వార్తని ప్రసారం చేశారని కొన్ని మీడియా చానల్స్ పై బొల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులో తనకు కానీ కుటుంబ సభ్యులకు కానీ ఖాతా కూడా లేదన్నారు. రుణం తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని బొల్లా సవాలు విసిరారు.

తక్కువ పెట్టుబడితో చిరుధాన్యాల సాగు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిరు ధాన్యాలను,కంది పంటల విస్తీర్ణం పెంచటం, వాటి వల్ల రైతులకు జరిగే మేలు తదితర అంశాల పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్య వసాయ శాఖాధికారి మురళి గురువారం నిర్వహించారు. మండల పరిధిలో ని మానుకొండవారిపాలెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ ఆహార భద్రత, ఆరోగ్య భద్రత నిర్వహణలో చిరుధాన్యాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని, వీటిని చాలా తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో సాగు చేయవచ్చని అన్నారు. వీటికి అవసరమైన మార్కెట్ సమస్యలు ఏమీ లేవని,రైతులు నిరభ్యంతరంగా వీటిని సాగు చేయవచ్చని సూచించారు. అలాగే, శనగ వేసుకునే రైతులకు సూచనలు చేశారు. శనగకు ముందు కొర్ర పంటను వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కొర్ర సాగు పనిముట్లు, కంది సాగు పనిముట్లను రైతు లకు అందజేశారు. జిల్లా వనరుల కేంద్రం డిడిఎం శివ కుమారి వ్యవసాయ శాఖ ఎడిఎ ఈ మస్తానమ్మ పనిముట్ల మినీకిట్లను అందజేశారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలాకుమారి చిలకలూరిపేట మండల వ్యవ సాయ అధికారి శ్రీలత, యడ్లపాడు మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పక ఈ -పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, కౌ లు కార్డులు తీసుకోవాలని చెప్పారు. ఎఇఒ శ్రీనివాసరావు, బిఎఎ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



రైతులకు అవగాహనా సదస్సులో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి, తదితరులు

సుస్థిర వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

డిబిఆర్సీ ఆధ్వర్యంలో మండలంలోని బొల్లవరం గ్రామ ఎస్సీ కాలనీలో చిన్న,సన్న కారు రైతులకు అవ గాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకి డిబిఆర్సి ఏరియా కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహిం చారు.మండల వ్యవసాయాధికారి అరుణ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ రైతులు, కౌలు రైతులు సిసిఆర్సి కార్డులు పొంది ప్రభుత్వం ద్వారా వస్తున్న రైతు భరోసా, బ్యాంక్ రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ,ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఓటు తొలగించే ముందు నోటీసులు ఇవ్వాలి

ప్రజాశక్తి - రెంటచింతల

ఓటర్ జాబితా నుంచి ఎవరి ఓటు అయినా తొల గించే ముందు తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలని, మృతి చెందిన ఓటర్ల పేర్లను తొలగించే ముందు సంబంధిత కుటుంబానికి సమాచారం ఇవ్వాలని తహశీల్దార్ కె.పుల్లా రావు అన్నారు. గురువారం బిఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన నోటీసులను, దరఖాస్తులను తప్పనిసరిగా ఫైల్ చేయాలని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా బిఎల్వోలదే నని అన్నారు. శుక్రవారం నుండి నెలరోజుల పాటు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించా లన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు రాజారావు,ఆర్ఐ కాంతారావు వీఆర్వో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి: టిడిపి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పండరిపురం లోని కార్యాలయంలో గురువారం రియల్ టైమ్ స్ట్రాటజీ, ఓటర్ల జాబితా పరిశీలన, హౌస్ మ్యాపింగ్ తదితర అంశాలపై నాదెండ్ల, చిలకలూరిపేట గ్రామీణ మండలాలకు చెందిన టిడిపి క్లస్టర్, యూనిట్ బాధ్యులు, బూత్ కన్వీనర్లు, ఏజెం ట్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి బూత్‌కు వెళ్లి ఓటు నమోదు కార్యక్రమం చేపడుతు న్నారని, నూతన ఓటరు జాబితా తయారీలో టిడిపి నాయ కులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు,బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు సమష్టిగా పాల్గొనా లన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరు జాబితాలోని పేర్లను క్షుణంగా పరిశీ లించాలన్నారు. టిడిపి సానుభూతిపరుల ఓటర్లను తొల గించడం, గ్రామాల్లో లేని కొత్త ఓటర్లను చేర్చడం వంటివి గమనించాలన్నారు. అభ్యంతరాలు ఉన్నచోట అధికారు లకు వినతిపత్రాలు సమర్పించాలని సూచించారు.



మహిళల ఆత్మగౌరవ ర్యాలీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మహిళలు పట్ల వైసిపి నాయకులు,ఎమ్మెల్యేలు మంత్రులు అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని సత్తెనపల్లి టిడిపి ఇన్చార్జి మాజీ మంత్రి కన్నా లక్ష్మినారాయణ విమర్శించారు. సత్తెనపల్లి పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహిళల ఆత్మగౌరవ ర్యాలీ గురువారం నిర్వహించారు. సాయిబాబా ఆలయం నుండి తాలూకా సెంటర్ వరకు మహిళలు ర్యాలీ చేశారు. టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పై అత్యా చారాలు దాడులు పెరిగాయని అన్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - మాచర్ల



స్థానిక రాయవరం జంక్షన్ లో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని రోడ్డు దాటుతున్న యువకుడు మృతి చెం దాడు. రాయవరం జంక్షన్ నుండి మాచర్ల వైపు వస్తున్న ద్విచక్ర వాహనం అతన్ని ఢీ కొట్టింది. మృతుడు బీహార్‌లోని ఒరియా గ్రామానికి చెందిన వ్యక్తి అని, అతని పేరు ముఖేష్ (30) అని సమాచాం. మాచర్ల పట్టణం లో జరుగుతున్న రోడ్డు పనులకు సంబంధించిన టిప్పర్‌కు డ్రైవర్‌గా పనిచేసేందుకు అతను వచ్చాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయినేజ్ నీరు కాలువలో కలువకుండా ఏర్పాట్లు

గుంటూరు ఛానల్‌ను పరిశీలించిన డిఇ కృష్ణ



ప్రజాశక్తి-తాడేపల్లి

గుంటూరు ఛానల్ కెనాల్‌లో కలుస్తున్న మురుగు నీటిని డిఇ కృష్ణ గురువారం పరి శీలించారు. ఉండవల్లి జామా యిల్ తోట సమీ పంలో ఆ ప్రాంతంలోని అపార్టుమెంట్ల నుంచి వస్తున్న పెద్దఎత్తున మురుగు గుంటూరు ఛానల్‌లో కలు స్తోంది. దీంతో ఛానల్‌లోని నీరు కలుషితం అవుతుంది. ఉండ వల్లి సెంటర్ నుంచి నులకపేట వరకు ఛానల్ కలుస్తున్న మురుగునీటిని ఆయన పరిశీలించారు. డ్రెయినేజీ నీరు కాలువలో కలవకుండా ఏర్పాట్లు చేస్తామని ఈ సందర్భంగా డిఇ చెప్పారు.



పోలకంపాడులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

మధ్యాహ్నభోజనం నాణ్యతలో రాజీపడొద్దు

ప్రజాశక్తి-తాడేపల్లి

పోలకంపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులో కలిసి భోజనం చేశారు. ఆహారం అందుతున్న తీరును పిల్లలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతపై ఎక్కడా రాజీ పడవద్దని,మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఎమ్మెల్యే వెంట పట్టణ వైసిపి కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి డేవిడ్‌రాజు, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ ఎం.వెంకటరామిరెడ్డి ఉన్నారు.

లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ



లక్ష్మయ్య భార్య సామ్రాజ్యమును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

మండలంలోని పమిడి వారిపాలెంలో ఇటీవల మృతి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పమిడి లక్ష్మయ్య . భార్య సామ్రాజ్య మ్మను, వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మయ్య కుటుంబానికి తమకు బంధుత్వం ఉందని చెప్పారు. ఆయనరి మృతి టిడిపికి తీరని లోటుగా అభివర్ణించారు. బుచ్చయ్యచౌదరి వెంట స్థానిక టిడిపి నాయకులు డి.మోహనరావు,కె.రాంబాబు, ఆర్.శివ రామకృష్ణ, ఎన్.గోపీనాథ్, వెంకటరావు, పి.కృష్ణ , సాయి, పి.రవీంద్ర, శ్రీనివాస్, డి.నాగరాజు ఉన్నారు.



బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గల బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో గురువారం వ్యవ స్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేనేజర్ డి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు పారేపల్లి మహేష్, ఎం శ్రీనివాస్ రెడ్డి, పి మస్తాన్రావు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండవల్లి ఎత్తిపోతల నీరు సక్రమంగా అందించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి ఎత్తిపోతల పథకం కింద రెండో పంటకు ఆశలు వదులు కోవాల్సిందే అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా జూన్ మొదటి వారంలో ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు నీరు అందేది. జులై వచ్చినా నీరు అందకపోవడంతో రెండో పంట వేసుకునే అవకాశం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. మొదటి పంట వరి వేస్తే పెట్టుబడులు వస్తాయి తప్ప రూపాయి మిగలదని రైతులు అంటున్నారు. రెండో పంట కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల మీద తమకు నాలుగు రూపాయలు మిగులుతాయని రైతాంగం చెబుతుంది. జులై చివరికి వచ్చినా తాగునీరు అందకపోవడంతో రెండో పంటకు అవకాశం ఉండదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్‌ను గురువారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి జొన్నా శివశంకరరావు, నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణలు వచ్చిన తరువాత నీటి సంఘాల పేరుతో ప్రభుత్వం ఉండవల్లి



రైతులతో కలిసి లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్‌ను పరిశీలిస్తున్న జొన్నా శివశంకర్

ఎత్తిపోతల పథకం నుంచి తప్పుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. ఇంతవరకు పంట పొలాలకు నీరు అందకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. లిఫ్టుకు సంబంధించి కాలువలు పెద్దఎత్తున మొలిచిన గడ్డిని తొలగించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత వహించి లిఫ్టు నుంచి రైతులకు నీరు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, రాజధాని రైతు సంఘం అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి, పి.వీరాస్వామి, టి.బక్కిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

సిఎం సభా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని,సిఎం సభ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణు గోపాలరెడ్డి ఆదేశించారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 24వ తేదీన రాజధానిలోని మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో పేదల సెంటు స్థలాల లే అవుట్ లో గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయడంతో పాటు తుళ్ళూరు మండలం వెంకటపాలెంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం కలెక్టర్,ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్,సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ,అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తో కలసి పరిశీలించారు. కృష్ణాయపాలెం లే అవుట్ లో ఇళ్ళ నిర్మాణాల శంకుస్థాపన పైలాన్, మోడల్ హౌస్ నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాటు పనులను వారు పరిశీలించారు. సభావేదిక, వీఐపీ వాహనాల పార్కింగ్, లబ్ధిదారుల ప్రయాణ వాహనాల పార్కింగ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల పై కలెక్టర్ అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు. అనంతరం వెంకటపాలెంలో నిర్వహించనున్న బహిరంగ సభ వద్ద ఏర్పాటు పనులను పరిశీలించారు. అధికారులతో సమావేశ మయ్యారు. చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు చేశారు. కార్యక్రమంలో డిఎఫ్ శివ రామకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి,హౌసింగ్ పీడీ వేణుగోపాల్,జడ్పీ సీఈవో



సిఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణు గోపాలరెడ్డి ,ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్,ఇతర అధికారులు

మోహనరావు, డీఆర్డీఎ పీడీ హరి హరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, భూగర్భ జలవనరుల శాఖ ఉప సంచాలకులు వందనం,సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజ బాబు, ఆర్అండ్‌బి ఎస్ఈ ఆర్ శ్రీనివాసమూర్తి, ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు రవీంద్ర,వెంకటేశ్వరు పాల్గొన్నారు.

వీధికుక్కలకు పట్టేస్తాం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి :గ్రామ సింహాలతో గజగజ ప్రజాశక్తిలో వచ్చిన వార్తా కథనంపై డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి స్పందించారు. పట్టణంలో ఉన్న వీధికుక్కలకు పట్టిస్తామని హామీనిచ్చారు. ఎంటిఎంసి పరిధిలోని మంగళగిరిలో ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలైందని, తాడేపల్లిలో కూడా త్వరలోనే కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కుక్కల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీనిచ్చారు.

మానవత్వం పరిమళించిన వేళ

ప్రజాశక్తి-తాడేపల్లి

వృద్ధురాలికి గూడు ఏర్పాటు చేసి తమ మానవత్వాన్ని చాటుకుంది. రెల్లి సంక్షేమ సంఘం. పటణంలోని ప్రకాష్‌నగర్‌లో కోడూరు నాగమ్మ పక్ష వాతంతో ఇబ్బంది పడుతోంది. ఉన్న పూరి గుడిసెలో వర్షం వస్తే ఇళ్లంతా కురిసి పరిస్థితి మరింత దయ నీయంగా తయారవుతుంది. ఈ పరిస్థితిని గమనించిన స్థానికులు,





రెల్లి సంక్షేమ సంఘం అధ్యక్షులు బండి దశ రథ్‌కు విషయం చెప్పారు. ఆయన వెంటనే స్పందించి రూ.87 వేల ఖర్చుతో గురువాం రేకుల షెడ్డు నిర్మించి అప్పగించారు.



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణం డాక్టర్ వైయస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఇందిరానగర్ ఎంక్వస్ట్ సర్టిఫికెట్ మార్క్స్ సాధించుటలో అత్యంత అధికమైన స్కోర్ హస్త గతం చేసుకుంది. గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సందర్శించారు. టీం స్పిరిట్ తో ఎంతో విజయాన్ని సొంతం చేసుకున్న పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూషని, స్టేట్ కన్సల్టెన్సీ డాక్టర్ రామారావుని డాక్టర్ నరేంద్రని డిస్టిక్ కన్సల్టెంట్ వాసులను అభినందించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, జయలక్ష్మి హెల్త్ అసిస్టెంట్ వాసు, మూర్తి , ఆశాలు పాల్గొన్నారు

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఉచిత బస్ పాస్ ల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిడమర్రు జెడ్‌పి హై స్కూలుకు చుట్టుప్రక్కల గ్రామాలనుండి వచ్చే 278 మంది విద్యార్థినులకు, ఎపిఎస్ ఆర్‌టిసి బస్ పాస్ లను రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారు పూర్తి ఉచితంగా అందచేశారు. గురువారం 20 జూలై 2023 మద్యాహ్నం నిడమర్రు జెడ్‌పి హైస్కూలులో జరిగిన పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన, రోటరీ జిల్లా 3150 పూర్వ గవ ర్నరు అన్నే రత్నప్రభాకర్, బాలికా సాధికారిత కోసం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారు చేస్తున్న సర్వీసు ప్రాజెక్టును ప్రశంసించారు.



పేద కార్యకర్తల వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు పేద కార్యకర్తలకు వైద్య ఖర్చుల నిమిత్తం తెలుగుదేశం పార్టీ తాడేపల్లి మండల సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్‌రావు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళగిరి,తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరంలో గురువారం టిడిపి నాయకులతో కలిసి కార్యకర్తలు షేక్ మస్తాని,షేక్ మౌలాలి,కోడి నాగుల్, షేక్ మాలింబి, ఆమె భర్త బాబుకు ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున, షేక్ సిద్దాకి రూ.5000, వడ్డేశ్వరం చిన్న బుల్లి కోటయ్యకు రూ.7,500 అందజేశారు. వారి వైద్య ఖర్చుల కోసం మధుసూదన్ రావు తన సొంత నిధులతో ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మధుసూదన రావు మాట్లాడుతూ తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో, తెలుగుదేశం పేద కార్యకర్తలను ఆదుకునేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈ పూరి బాబు, పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రహ్మణ్యం, షేక్ నాగూర్ వలి, షేక్ జాన్ బి, వడ్డేశ్వరం అబ్రహం, జోరుగ దాసు, షేక్ బాజీ, పఠాన్ మస్తాన్, మర్రి మౌలాలి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాబ్రికేషన్ వర్కర్ కు వెల్డింగ్ మిషన్ అందజేత



ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లికి చెందిన ఫ్యాబ్రికేషన్ వర్కర్ సర్వ మత్త య్యకు గురువారం తెలుగుదేశం తాడేపల్లి మండల కార్యా లయంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు వెల్డింగ్ మిషన్‌ను అందజేశారు. అమరా సుబ్బారావు మాట్లాడుతూ స్వయం శక్తి పథకం కింద మత్తయ్యకు వెల్డింగ్ మిషన్ అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు దాశెట్టి అరుణ, తాడే పల్లి మండల తెలుగు రైతు కార్యదర్శి శేషంశెట్టి శ్రీనివాసరావు, క్రిస్టియన్ సెల్ నాయకులు కోలంటి మాణిక్య రావు, కె.వేలంగిణి, ఎం.మల్లికార్జునరావు, కనపర్తి విజయ్ పాల్గొన్నారు.

వృత్తిదారుడికి ఇస్త్రీ బండి



ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన వృత్తిదారుడు పెనుమాక సాంబయ్యకి గురువారం ఇస్త్రీ బండిని అందజేశారు. కుంచనపల్లిలోని టిడిపి తాడేపల్లి మండల కార్యా లయంలో ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-మంగళగిరి

రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరకట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర టిడిపి మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య విమర్శించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనితపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయా లని డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ కార్యాలయం ఎమ్మెన్సస్ భవన్ లో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, నియోజకవర్గ టీడీపీ మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, మంగళగిరి పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఊట్ల దుర్గామల్లేశ్వరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

తెనాలి రైతుబజార్లో మినపగుళ్లు విక్రయం

కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ప్రజాశక్తి-తెనాలి

మిపపగుళ్ల ధర అధికంగా ఉన్న నేపథ్యంలో తెనాలి డాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతుబజార్లో చౌకగా విక్రయించేం దుకు శ్రీకారం చుట్టారు. రత్నాటాకీస్ రైతు బజార్లో ఏర్పాటు చేసిన విక్రయకేంంద్రాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల నియంత్రణలో భాగంగా డాల్మిల్లర్స్ అసోసి యేషన్ సహకారంతో నాణ్యమైన మినపగుళ్ళను కేజి రూ.98 కే విక్రయిస్తున్నట్లు చెప్పారు. వాస్తవానికి వాటి ధర బహిరంగ మార్కెట్లో కేజి రూ.110 ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ సాయి హరేరామ్, అసోసియేషన్ బృందం పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనగాని

స్టార్టప్స్పై కిట్స్లో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

విංజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ఆర్టిఫీషియల్, ఇంటి లిజెన్స్ వారి ఆధ్వర్యంలో స్టార్టప్, ఎంటర్ ప్రెన్యూర్షిప్పై విద్యార్థులకు రెండ్రోజుల పాటు నిర్వహించిన అవగాహన తరగతులు గురు వారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎటిఒయంఎస్ గ్రూప్ ఫౌండర్ అండ్ చైర్మన్ అయ్యప్ప శిగినం పాల్గొన్నారు. స్టార్టప్లలో ఎదురయ్యే సవాళ్లు వాటి పరిష్కారాలతోపాటు విద్యార్థి ఉన్నత స్థితిని పొందటానికి ఎస్డబ్ల్యూఓటి అనాలసిస్ థియరీని వివరించారు. విజయవంతమైన వ్యవస్థాపకులు, వారి విజయానికి గల కారణాలను ఉదాహరణలతో వివరించారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టార్టప్, ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ పాలసీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాయని, విద్యార్థులు వారి నూతన విధానాలతో ఆర్థిక వృద్ధిని సృష్టించి తోటి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, సిఎఐ విభాగాధిపతి డాక్టర్ జి.మురళి తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప శిగినంతో ప్రిన్సిపాల్ తదితరులు

సరికొత్త ఇన్నోవేషన్లకే పేటెంట్

ప్రజాశక్తి-గుంటూరు :సరికొత్త ఆలోచనలతో రూపొందించే ఇన్నోవేషన్లకే పేటెంట్స్ దక్కుతాయని కోయంబత్తూరులోని ఇంటెల్ ఇన్నోవేటర్, నాస్కామ్ ప్రైమ్ అంబాసిడర్ డాక్టర్ శ్రీరామ్క్రిస్ వాసుదేవన్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఈ-సెల్ సంయుక్తంగా 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ అండ్ అవుట్' అనే అంశంపై విద్యార్థులకు గురువారం అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ్ క్రిస్ వాసుదేవన్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దష్టి సారించాలన్నారు. సరికొత్త ఇన్నోవేషన్స్ను సష్టించే విద్యార్థులు వాటిపై పేటెంట్స్ను పొందడం వలన దేశ ఆర్థికాభివద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు పేటెంట్స్ను సాధించడానికి ఎలా ప్రయత్నించాలో దశల వారీగా వివరించారు. రీసెర్చ్ జర్నల్స్కు- పేటెంట్స్కు మధ్య వ్యత్యాసాలను విశదీకరించారు. రీసెర్చ్ జర్నల్స్ కోసం ప్రయత్నించకుండా విద్యార్థులు పేటెంట్స్ను సాధించినట్లయితే వ్యక్తిగతంగా అభివద్ధి చెందడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందుతారన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వాసుదేవన్

జిఎంసిలో టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని యుటిఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.చిన్నయ్య, కె.ప్రభూజీ ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలు ప్రారంభం అయ్యి నెల రోజులు గడిచినా బదిలీలు, ప్రమోషన్లు జరగకపోవటం వల్ల ఉన్నత పాఠశాలల్లో బోధన కుంటుపడుతుందన్నారు. స్వర్ణాంధ్ర నగర్లోని 1-10 తరగతుల్లో 377 మంది విద్యార్థులుంటే 9 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లే ఉన్నారన్నారు. సబ్జెక్టు టీచర్లు లేక 6-10 విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అప్గ్రేడ్ అయ్యి 5 సంవత్సరాలు అయినా సబ్జెక్ట్ టీచర్లు లేరన్నారు. ఇటీవల కొన్ని ఉన్నత పాఠశాలలకు ఎస్జిటిలను సర్దుబాటు చేసినా, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఇంకా ఉందన్నారు. కావున నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఉన్న సర్వీసు రూల్స్ను అనుసరించి వెంటనే బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని కోరారు.

ప్రమాదాల నివారణపై ఆర్టీసీలో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించే కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బ్యాంకు కన్సల్టెంట్-కమ్- ట్రైనర్ ద్వారా గుంటూరు ఆర్టీసి బస్టాండ్, తిక్కన కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.రవికాంత్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. ఆహార నియమాలు, ఆరోకరమైన వాతావరణంలో డ్రైవింగ్ ఏవిధంగా చేయాలి, తొందరపాటు వల్ల ఏవిధమైన అనర్థాలు జరుగుతాయో వివరించారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్టీసి బస్సుల పరంగా జరిగిన ప్రమాదాలను తెలియజేస్తూ, సెల్ఫోన్ డ్రైవింగ్ వల్ల, డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత లోపించటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేస్తూ, ప్రతి డ్రైవర్ ప్రతిరోజూ డ్యూటీకి వెళ్లే సమయంలో భద్రతా సూక్తి పఠించాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ప్రతి డ్రైవర్ గుర్తుంచుకోవాలన్నారు. డ్రైవర్లకు మానసిక విశ్రాంతి ఎంతో అవసరమని, ఒత్తిడిని తగ్గించుకోవటానికి శారీరక విశ్రాంతికి ప్రాధాన్యత ఇవ్వటం, రెగ్యులర్గా వైద్య పరీక్షలు చేయించుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు-2 డిపో మేనేజర్ ఎస్.కె.అబ్దుల్ సలాం, మెకానికల్ సూపర్వైజర్లు ఆర్ఎస్డిఐలు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

నేటి నుండి ఓటు నమోదుకు ఇంటింటి సర్వే

- ఎన్నికల విధుల్లో వాలంటీర్లను వినియోగిస్తే కఠిన చర్యలు
- జనవరిలో తుది ఓటర్ల జాబితా
- సచివాలయాల్లో వివరాలు ప్రదర్శన

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్


మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఎన్నికల విధుల్లో వాలంటీర్ల సేవలు వినియోగించరాదని అలా వినియోగించుకున్న పోలీంగ్ కేంద్ర అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. గురువారం నరసరావు పేట కలెక్టర్ కార్యాలయములోని బి.ఆర్. అంబేద్కర్ స్పందన హాలులో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులపై జిల్లాలోని వివిద రాజకీయ పర్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ఓటర్ల జాబితా తయారీపై వివరాలు సేకరణకు 21 నుండి ఆగష్టు 21 వరకు ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్ ప్రక్రియ వంటివి ఆగష్టు 29 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్లైమ్లు, ఫైలింగ్ మరియు అభ్యంతరాలు స్వీకరిస్తామని తుది ఓటర్ల జాబితాను జనవరిలో అందు బాటులో ఉంచుతామన్నారు. వలస ఓటర్ల విషయంలో పరిశీలించి సవరణలు చేయాలన్నారు. భార్య,భర్తలకు వేర్వేరుగా ఓటు ఉన్నట్లయితే వారి అభ్యర్ధన మేరకు ఒకే దగ్గర ఓటు హక్కు వినియోగించుకునేల సవరణలు సంబంధిత ఈఆర్ఒల సహకారంతో పూర్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్ధన మేరకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితా నుండి తొలగించు కొనుటకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు పోలీంగ్ కేంద్రాల్లో ఏజంట్లను నియమించి ఓటరు లిస్టు సవరణలో తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రతి 15 రోజులకొకసారి ఓటరు జాబితాలను సంబంధిత సచివాలయాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో ఉంచుతామన్నారు. వీటితో పాటు తొలగించిన ఓటరు జాబితాలను కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు లేవనెత్తిన పలు అంశాలను పై అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, నియోజకవర్గ ఎలెక్టోరల్ అధికారులు మరియు రెవెన్యు డివిజనల్ అధికారులు రాజకుమారి, శేషిరెడ్డి, అద్దెయ్య, డిఎఫ్ఒ రామచంద్ర, పలు రాజకీయ పార్టల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024కు సంబంధించి ఎన్నికల కమిషన్ అదేశాల ప్రకారం నిర్వహించే వివిధ ప్రక్రియలలో రాజకీయపార్టీలు భాగస్వాములై తప్పులు లేని ఓటర్ల జాబిత రూపొందించటానికి అధికారులకు సహకరించాలని తూర్పు ఎలక్టోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతి నిధులు మాట్లాడుతూ ఓటరు లిస్టులలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల ఓట్లు వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఉన్నాయని, వాటిని ఒకే బూత్లోకి చేర్చాలని కోరారు. సచివాలయాల్లో ఉద్యోగులు ఓటరు ధరఖాస్తులపై అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని, బీఎల్వోల ఫోన్ నెంబర్లు సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు.సమావేశంలో పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఏఈఆర్వోలు బి.శ్రీనివాసరావు, ప్రదీప్కుమార్, కోటయ్య, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మ వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్లు జాబితాను పరిశీలించుకోవాలి..

ఓటర్ల జాబితాలో మీ ఓటు ఉన్నదీ, లేనిదీ ప్రత్యక్షంగా పరిశీలించుకోవాలని, ఓటు హక్కు కలిగి, ఓటర్ కార్డ్లో చిరునామా, డోర్ నంబర్ల సవరణలు ఉంటే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 ఓటర్ల జాబితాకి సంబందించి ఈ నెల 21 నుండి ఆగస్ట్ 21 వరకు స్పెషల్ క్యాంపెయిన్ ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో కోరారు.


పుస్తకావిష్కరణలో పాల్గొన్న విసి తదితరులు

టెక్నాలజీ టుడే పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ భవనం నాగ కిషోర్, డివిఎస్ఆర్కే చైతన్య, ఆచార్య ఈ శ్రీనివాస్ రెడ్డి, వసుజా దేవి, విద్యార్థి నైన రూపొందించిన టెక్నాలజీ టుడే పుస్తకాన్ని వర్సిటీ విసి పి.రాజశేఖర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరు సాంకేతికత పట్ల అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. నేటి సమాజంలో తెలుసుకోవాల్సిన అనువర్తనాలను ఈ పుస్తకంలో పేర్కొనడం జరిగిందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఇది ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ పి. వర ప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, ప్రిన్సిపాల్ సిద్దయ్య, డీన్ శ్రీనివాసరెడ్డి, అమతవల్లి, రాజేశ్వరి, సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

భయం.. భయం..

బాలికల హాస్టల్లో పెచ్చులూడుతున్న పైకప్ప

మరమ్మతులు చేపట్టకుంటే ప్రమాదమని తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి - రెంటచింతల


భోజనం చేస్తున్న విద్యార్థినులు


వసతి గృహంలో పెచ్చులూడిన పైకప్ప



మండల కేంద్రమైన రెంటచింతలలోనే బీసీ బాలికల వసతి గృహం పైకప్పు పెచ్చులూడి ప్రమాద భరితంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పైకప్పు నీటితో నాని ప్రమాదం పొంచి ఉందని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 162 మంది విద్యార్థులు ఉండే ఈ హాస్టల్ భవనాన్ని 2006లో నూతనంగా నిర్మించారు. నాణ్యతాలోపం వలన గదుల్లో ఇనుప చూవ్వలు బయటపడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్విఆర్ అండ్ జెసి విద్యార్థులకు ఎన్సిసి సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్సిసి శిక్షణ విద్యార్థుల దేశభక్తికి, సామాజిక సేవా నిరతికి నిదర్శమని ఆర్విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్సిసి బాలుర విభాగ సర్టిఫికెట్-బి, సర్టిఫికెట్-సి పరీక్షల్లో నూరుశాతం ఉత్తర్ణులైన 21 మంది కళాశాల విద్యార్థులను గురువారం కాలేజి యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్మీ ఉద్యోగాల్లో ఇంజినీరింగ్ విద్యార్థులకు అగ్రస్థానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాయని, ఇంజినీరింగ్ విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం దేశరక్షణకు ఎంతో అవసరం అని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేజి ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కళాశాల ఎన్సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ తారాచంద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.


ఎన్సిసి సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థుతో కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు